క్లుప్తంగా

మొబైల్ బుక్‌హౌస్ ప్రారంభం



మొబైల్ బుక్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న సీఐ రామారావు

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విశాలాంధ్ర మొబైల్ బుక్‌హౌస్‌ను పాతపట్నం సీఐ వి.రామారావు సోమవారం ప్రారంభించారు. పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటు ఉండడం గొప్ప విషమన్నారు. డీహెచ్‌ఎస్ జిల్లా కార్యదర్శి వై.గోపి, ఎల్.శంకర్, భాస్కర్, నాషేర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



డీటీ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: మండల కేంద్రంలోని పలు వీధులకు తాగునీరు అందడం లేదని వైఎస్సార్‌సీపీ సినియర్ నాయకుడు బి.నారాయణ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. పాతపట్నం మండల కేంద్రంలోని బాలాజీనగర్–2లో జేజేఎం ప్రాజెక్టులో భాగంగా ఇంటింటికీ కుళాయి వేశారని, వీటి ద్వారా నీరు రావడం లేదన్నారు. పలు వీధుల్లో కుళాయిల కోసం సీసీ రోడ్లు తవ్వి వదిలేస్తున్నారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తాగునీరు అందించాలని, తవ్విన రోడ్లను వెంటనే పూడ్చాలని కోరారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్

హిరమండలం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, తద్వారా సురక్షిత ప్రయాణం సాగించవచ్చునని స్థానిక ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్ సూచించారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద సోమవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా ఇన్సురెన్స్ చేయించుకోవాలన్నారు. చిన్న పొరపాటు జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేస్తుందన్నారు. కుటుంబ సభ్యులు కూడా హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

ఆమదాలవలస: సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కె.వెంకటేష్ అన్నారు. మండలంలోని కొత్తవలసలో సైబర్ మోసాల పట్ల సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు ఇప్పిస్తామని ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే అటువంటి వారికి ఎటువంటి సమాచారం ఇవ్వొద్దని సూచించారు. ఏటీఎం కేంద్రాల వద్ద గుర్తుతెలియని వ్యక్తులకు ఏటీఎం కార్డు ఇచ్చి డబ్బులు తీయమని కోరవద్దన్నారు. ఏటీఎం పిన్, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఎవరైనా అడిగితే చెప్పవద్దన్నారు. గంజాయి మత్తుకు అలవాటు పడితే జీవితం చిత్తు అవుతుందన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కొత్తూరు: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొత్తూరు మండలశాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను గ్రంథాలయాధికారి ఇందిర నిర్వహించారు. పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేస్తామన్నారు.

బూర్జలో..

బూర్జ: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి కె.సునీత అన్నారు. సోమవారం విద్యార్థులకు కుర్చీ ఆట, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు ఎప్పటికో?



ఎల్.ఎన్.పేట మండల కేంద్రం

- జిల్లాలో గ్రంథాలయం లేని మండలం ఎల్.ఎన్.పేట
- 25 ఏళ్ల క్రితం ఆవిర్భావం
- నిరుద్యోగులు, విద్యార్థులకు అందని సేవలు

ఎల్.ఎన్.పేట: సరుబుజ్జిలి నుంచి కొంత భాగాన్ని వేరుచేసి ఎల్.ఎన్.పేట కేంద్రంగా కొత్త మండలాన్ని 1999 ఫిబ్రవరి 26వ తేదీన ఎంతో అర్భాటంగా అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. మండలం ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తయినప్పటికీ ప్రభుత్వ గ్రంథాలయం లేదు. 1999 నుంచి 2004 వరకు, 2014 నుంచి 2019 వరకు, 2024 నుంచి (ప్రస్తుతం) టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఈ 25 ఏళ్లలో పదేళ్లకు పైగా సీఎంగా చంద్రబాబు ఉన్నారు. జిల్లా నుంచి కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఉన్నప్పటికీ పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా పోతున్నాయి. పాలకులకు మండల ప్రజలపై చిన్నచూపు ఎందుకో? అని పలు వర్గాలవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయ ఏర్పాటు అధికారులు, పాలకులకు పట్టదా? అని ప్రశ్నిస్తున్నారు. గ్రంథాలయాల వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా 'సాక్షి' కథనం.

ప్రభుత్వ గ్రంథాలయం ఏది?

ఎల్.ఎన్.పేట మండలం ఏర్పడిన తరువాత ప్రభుత్వ గ్రంథాలయం లేకపోవడంతో అనేక పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గ్రంథాలయ సేవల కోసం శ్రీకాకుళం, ఆమదాలవలస, హిరమండలం, పాతపట్నం, కొత్తూరు వంటి పట్టణ ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. మండలం నుంచి ప్రతి పోటీ పరీక్షకు సుమారు 10 వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతుంటారని మీ–సేవ కేంద్రాల ద్వారా నమోదు అవుతున్న దరఖాస్తుల సంఖ్యను పరిశీలిస్తే తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో మరో వెయ్యి మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ప్రతీ ఏడాది 600 మంది పదో తరగతి విద్యార్థులు, 300 మంది వరకు ఇంటర్ విద్యార్థులు చదువులు పూర్తిచేస్తున్నారు. పోటీ పరిక్షలకు సిద్ధమయ్యే సమయంలో గ్రంథాలయ సేవలు అందుబాటులో లేక పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు.

చాలా అవసరం



గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఎంతో మంది నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతుంటారు. వారికి అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. గ్రంథాలయం లేకపోవటం వలన నిరుద్యోగులు పట్టణ ప్రాంతాలకు వెళ్లడంతో వారికి ఆర్థిక భారం అవుతుంది.

– పెద్దకోట వెంకటరావు, ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (టెస్) అధ్యక్షుడు, ఎల్.ఎన్.పేట

అందరికీ ఉపయోగమే..



నిరుద్యోగులతోపాటు అన్ని వర్గాల వారికి గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుంది. మండల కేంద్రానికి అనేక పనులపై వచ్చినవారు ఒకపూట వేచి ఉండాలంటే గ్రంథాలయానికి వెళ్లి పత్రికలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదువుకునే వీలు ఉంటుంది. పాలకులు, అధికారులు స్పందించి తక్షణమే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి.

– లుకలాపు రాజారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, మిరియాపల్లి, ఎల్.ఎన్.పేట

ప్లాన్ ఒకటి.. నిర్మాణం మరొకటి

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



పెద్దపేట వీధిలో నిర్మాణంలో ఉన్న షాపులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో భవన నిర్మాణాలు ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. అనేక భవనాలు ఎటువంటి అనుమతి లేకుండా నిర్మాణం చేస్తుండగా.. మరికొందరు ఒక పేరుతో అనుమతి పొంది మరో విధంగా నిర్మాణం చేపడుతున్నారు. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు లోపాయకారంగా సహాయం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా పెద్దపేట వీధిలోని ఓ అపార్ట్‌మెంట్ ఎదురుగా జరుగుతున్న నిర్మాణంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రోడ్డుకు ఆనుకొని మండలంలోని పారసెల్లి గ్రామానికి చెందిన వ్యక్తి దుకాణాలు నిర్మిస్తున్నారు. నరసన్నపేటలో దుకాణ సముదాయం నిర్మిస్తే విధిగా శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(సుడా) అనుమతి పొందాలి. అక్కడకు వెళ్తే అనుమతి ఆలస్యంగా వస్తుందని, ఖర్చు ఎక్కువగా అవుతుందని భావించిన సదరు వ్యక్తి పంచాయతీలో ఇంటి నిర్మాణానికి అనుమతి పొందారు. తక్కువ ఖర్చుతో పని అయిపోయింది. ఆయన ఆలోచనలకు తగ్గట్టుగా షాపుల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో స్థానికులు పంచాయతీ ఈఓకు సమాచారం ఇచ్చారు. రోడ్డు వరకు ఆయనకు ఉన్న ఆస్తిలో నిర్మాణం చేపడుతున్నారని, ఇక్కడ షాపులు పెడితే వాహనాలు రోడ్డుపైనే ఉంటాయని, ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతుందని, ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్లాన్ మార్చాలని సూచించాం..

ఈ విషయాన్ని పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని వద్ద ప్రస్తావించగా.. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి పరిశీలించామన్నారు. నిర్మాణదారుడితో మాట్లాడామన్నారు. ఇంటి ప్లాన్‌తో షాపుల నిర్మాణం చేపడుతున్నందున ప్లాన్ మార్చుకోమని సూచించామని, దీనికి నెల రోజులు గడువు ఇచ్చామన్నారు. సుడాకు వెళ్లి అనుమతి తీసుకోవాలని సూచించామన్నారు. ప్లాన్ తీసుకోకపోతే ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చిన్నారావు

పాతపట్నం: జిల్లాలోని దళితుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు కోళ్ల చిన్నారావు అన్నారు. సోమవారం స్థానిక ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. డీహెచ్‌పీఎస్ పాతపట్నం మండల అధ్యక్షుడిగా రంగిణి గ్రామానికి చెందిన పసుపు రెడ్డి భాస్కరరావును ఎన్నుకోవడం జరిగిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, కోశాధికారి వెంకటరావు పాల్గొన్నారు.

కొత్తూరు నుంచి శబరిమలకు పాదయాత్ర



కొత్తూరు మండలంలోని నాలుగు రోడ్లు కూడలి నుంచి శబరిమలకు ఐదురుగు అయ్యప్ప స్వాములు సోమవారం పాదయాత్రగా బయలుదేరారు. సుమారు 1,800 కిలో మీటర్లు దూరంలో ఉన్న శబరిమలకు మకర జ్యోతి నాటికి చేరుకొనున్నటు స్వాములు తెలిపారు. పాదయాత్ర చేసిన వారిలో పాత పొనుటూరు, మాతల, బమ్మిడి గ్రామాలకు చెందిన స్వాములున్నారు. – కొత్తూరు

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం పాలవలస వద్ద రహదారి. రొట్టవలస నుంచి పురుషోత్తపురం రహదారిలో ఇరువైపులా పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో అధికారిక ఇసుక ర్యాంప్ ప్రారంభం కావడం వలన లారీలు, ట్రాక్టర్లతో రహదారి రద్దీగా మారింది. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

అభినందన..



బూర్జ మండలంలోని కొల్లివలస డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు 40 మంది జోనల్ స్థాయి ఆటల పోటీల్లో సత్తా చాటారు. విజయనగరం జిల్లా కొప్పెర్ల గురుకులంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజులపాటు ఆటల పోటీలు నిర్వహించారు. వాలీబాల్ జూనియర్ విభాగంలో జోనల్ స్థాయిలో విన్నర్స్‌గా, సీనియర్స్ స్థాయిలో కబడ్డీ, ఖోఖోలో రన్నర్స్‌గా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, అధ్యాపకులు, సిబ్బంది సోమవారం అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాక్షించారు. – బూర్జ

ఇళ్ల స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు



కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీలోని ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రవిచంద్రకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు కోరారు. కాలనీలోని ఫ్లాట్ నంబర్ 363–ఏ నుంచి 367 వరకు ఉన్న ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే కాలనీలో పలు రోడ్లు ఆక్రమణకు గురయ్యాయని, ఆక్రమణలపై విచారణ చేపట్టాలని కోరారు. – కొత్తూరు

'నా పంట' యాప్‌పై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సెంచూరియన్ విద్యార్థులు

మెళియాపుట్టి: 'నా పంట' యాప్‌ను వినియోగించి వ్యవసాయంలో మెలకువలు పాటించాలని పర్లాకిమిడి (ఒడిశా) సెంచూరియన్ వర్సిటీ విద్యార్థులు అన్నారు. సోమవారం మండలంలోని సిరియాఖండి గ్రామంలో రైతులకు 'నా పంట' యాప్ వినియోగం, ఉపయోగాలు తెలియజేశారు. డిజిటల్ వ్యవసాయంతో ఎంతో మేలని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు పండించే పంటల ధరలు, వాతావరణ సూచనలు, తెగుళ్ల సమయంలో తీసుకోవాల్సిన నివారణ పద్ధతులు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని అన్నారు. దగ్గరలో ఉన్న ఎరువులు, విత్తనాల డీలర్ల వివరాలు సైతం ఇందులో ఉంటాయన్నారు. సేంద్రీయ పద్ధతిలో పంటలను పండించాలన్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు హేమంత్, సాయికుమార్, రైతులు పాల్గొన్నారు.

శివోహం

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. వేకువ జాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. పుణ్య స్నానాలు ఆచరించి శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: పెద్దపాలెం భ్రమరాంబమల్లికార్జున ఆలయంలో శివలింగానికి అభిషేకం



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయ ఆవరణ, కంపార్ట్‌మెంట్‌లో ఉన్న భక్తులు



మెళియాపుట్టి: చాపర శివాలయంలో వద్ద క్యూ కట్టిన భక్తులు



నరసన్నపేట: పాతబస్టాండ్‌లోని ఉమామహేశ్వరాలయ వద్ద భక్తులు



బూర్జ: కురింపేట ఉమామహేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హిరమండలం: పాత హిరమండలంలోని ఎండల మల్లికార్జునస్వామి ఆలయలం వద్ద బారులు తీరిన భక్తులు



సారవకోట: అంగూరు శివాలయం వద్ద క్యూలో ఉన్న భక్తజనం



పాతపట్నం: నీలకంఠేశ్వర ఆలయం వద్ద అన్నప్రసాద వితరణలో పాల్గొన్న భక్తులు



ఎల్.ఎన్.పేట: కొత్తపేట శివాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

8 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: మండల కేంద్రంలోని అంతరాబ కూడలి వద్ద 8 మద్యం బాటిళ్లతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.కృష్ణారావు సోమవారం తెలిపారు. పాతపట్నం గ్రామానికి చెందిన వ్యక్తి 8 మద్యం బాటిళ్లను తీసుకువెళ్తుండగా పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాల ముందు ధరల పట్టికను తప్పనిసరిగా ఉంచాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

పాతపట్నం: మండలంలోని పేడురు గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని పాతపట్నం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.కృష్ణారావు సోమవారం తెలిపారు. ఈ దాడుల్లో పాతపట్నం మొబైల్ టీమ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి జాబ్‌కార్డుల వివరాలు సేకరణ

మెళియాపుట్టి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న ఉపాధి వేతనదారులకు ఇది వరకు మంజూరు చేసిన జాబ్‌కార్డుల వివరాలు సేకరిస్తున్నామని ఏపీఓ రవికుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధి కార్డులు ఉండి చనిపోయినవారి పేర్లు గుర్తించి తొలగిస్తున్నామన్నారు. కొత్త జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్



సచివాలయ సిబ్బందికి అర్జీలు ఇస్తున్న సీపీఐ నాయకులు

నరసన్నపేట: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. మండలంలోని జమ్ము సచివాలయ సిబ్బందికి సోమవారం అర్జీలు అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలో అర్హత కలిగిలిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, ఇనుము ఉచితంగా ఇవ్వాలన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం



ఎల్.ఎన్.పేట: సిద్ధాంతంలో లక్ష దీపాలు వెలిగించిన భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని సిద్ధాంతం గ్రామంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం లక్ష దీపారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామస్తుల సహకారంతో ఏర్పాట్లు చేశామని కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు తెలిపారు. గ్రామ పెద్ద త్రిపురాన వెంకటరత్నం పాల్గొన్నారు.

కనుల విందుగా..

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్‌కాలనీలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని లక్ష దీపోత్సవం కనుల విందుగా జరిగింది.



కొత్తూరు: మెట్టూరు ఆర్‌ఆర్‌కాలనీలో నిర్వహించిన లక్ష దీపోత్సవం

ఆలయ ధర్మకర్త బూర్లె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పిన్నింటి ప్రసాదరావు (అయ్యప్ప గురుస్వామి) ప్రారంభించారు. టీటీడీ ఆధ్యాత్మిక మండలి మండల కన్వీనర్ పాగిరి రవి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కళ్లాల్లోనే ధాన్యం బస్తాలు



వెంకటాపురం వద్ద రోడ్డు పక్కనే ఉన్న ధాన్యం బస్తాలు

సారవకోట: మండలంలో వరి కోతలు దాదాపు పూర్తికావస్తున్నా నేటికీ కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీంతో ధాన్యం బస్తాలు కళ్లాలు, రోడ్డుకు ఇరువైపులా నిల్వ చేస్తున్నారు. కొంతమంది రైతులు నిల్వ చేసేందుకు స్థలాలు లేక, ఆర్థిక సమస్యల కారణంగా పచ్చి ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయించారు. మరికొంత మంది రైతులు ధాన్యం ఆరబెట్టి వాటిని కొనుగోలు కేంద్రాలకు విక్రయించాలనే ఉద్దేశంతో బస్తాల్లో నిల్వ ఉంచుతున్నారు. ప్రభుత్వం త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.